# ఇదిప్పుడు మన దేశమే!

నా చేతికి కార్డిచ్చారు; వెళ్ళి ఆఫీసర్ని కలుసుకో మన్నారు. వెళ్ళాను. కుర్చీలో కూర్చున్నాడు ఆఫీసర్ నెత్తికి తెల్లటి తలపాగా చుట్టుకుని, గడ్డంచుట్టూ నీలం గుడ్డ కట్టుకుని; ఆఫీసర్ గాబట్టి భుజంమీద భుజకీర్తులతో సహా.

"నచ్చావ్" అన్నాడు హిందీలో.

ఔనన్నాను ఇంగ్లీషులో.

"ఏ కాలు?"

"కుడికాలు"

"అసలు పనికిరాదా?"

"యెందుకూ పనికిరాదు!"

"హుఁ" అన్నాడు; యే భాషలో అన్నాడో ఇప్పటికీ అర్థంకాదు నాకు.

అతనికీ నాకూ మధ్య ఒక టేబుల్; టేబుల్నిండా ఫైళ్లు. నా ప్రక్కనే ఒక కుర్చీ; ఖాళీగా వుంది.

అందులో కూర్చున్నాను, కళ్లెత్తి చూశాడు, తలెత్తకుండానే; తల వంచి యేదో ఫైల్ తిరగేస్తున్నాడు.

"ఇదొక పెద్ద ఇన్స్యూరెన్స్ కంపెనీ, గేట్ కీపర్ కావాలట వెళ్ళగూడదూ. పనేవీఁ వుండదు. గేట్ దగ్గర, గోడ పక్కనే, గోడకాన్చి స్టూలో, కుర్చీయో వుంటుంది. దాని మీాద కూర్చోటవేఁ పని. పనేవీఁ వుండదు. వెళ్ళు; మంచి ఉద్యోగవేఁగా" అన్నాడు సగం హిందీలో, సగం ఇంగ్లీషులో.

"వద్దులే" అన్నాను.

"యేఁ?"

"ఇక్కడుద్యోగం చేసేప్పుడు గూడా కూర్చోవడం అలవాటు కాలేదు; కూర్చోడం అంటే నాకు పడదు" అన్నాను.

"నా మాటెను" అన్నాడు హిందీలో; కాదు, ఆదేశించాడు. "చూశావ్, నీ కేవీఁ లోటులేదు. దిట్టంగా వున్నావు. ఆరోగ్యం బాగావుంది. గట్టి గుండె నీది. మంచి తెలివితేటలున్నై. ఒక్కసారి ఆలోచించు ఇప్పుడు నీ వయసిరవై తొమ్మిది; యెట్లా లేదన్నా డెబ్భయేళ్లు బతుకుతావ్. నీకిప్పట్నుంచీ పెన్షనిస్తే.........ఆలోచించు; సంవత్సరానికి పన్నెండు మాసాలు, నలభై పన్నెండులు నాలుగువందల యెనభై, నాలుగువందల యెనభై నెల్లకి, నెలకెన్ని రూపాయల చొప్పున...యెంతౌతుందో చూడు; ఐనా ఇలాంటి వాడివి నువ్వొక్కడివేనా, యెంతమందుంటారో; యెంత నష్టవోఁ చూశావా? ఇట్లా పెన్షన్లిస్తూంటే దేశానికెంత నష్టం. ఆ డబ్బంతా పంచవర్ష ప్రణాళిక్కి ఉపయోగిస్తే... ఐనా ఇప్పుడిది మన దేశం, స్వతంత్రం వచ్చిందిగా. నా మాటెను. కాదనకు" అన్నాడు హిందీలోనూ, ఇంగ్లీషులోనూ.

"హుఁ" అన్నాను నేనప్పుడు.

"ఐతే సరేనా?"

"ఆగోడ కానుకుని కూర్చునే ఉద్యోగం వద్దు బాబూ".

"పిచ్చిగానేవీఁ యెక్కలేదు గదా నీకు" అన్నాడు ఆఫీసర్, స్నేహంగా, మంచిగా మందలించినట్టు.

"పిచ్చి నాకేమీ యెక్కలేదు. నాది గట్టిగుండె, మంచి తెలివితేటలున్నైన్నాకు; ఆలోచించాను. నాకదొద్దు" అన్నాన్నేను.

కుర్చీ తలకి తన తలానించి, వెనక్కి తేలి, కాళ్ళు రెండూ లేపి, లాగిన సొరుగు చివరల కానించి, దీర్ఘంగా ఆవులించాడు ఆఫీసర్. ఆఫీసర్ కాదూ, అందుకని బూట్లు తెల్లగా వున్నైన్న; అడుగు మాత్రం నల్లగా బెతికలు కట్టుంది. ఆవులించి "దేఖో, దోస్త్! ఇదుగో విను, ఒక్క కాలుకోసం, ఇందాకన్నానే, అంత డబ్బు వెచ్చిస్తే దేశానికెంత నష్టవోఁ ఆలోచించావ్? ఒక్క కాలుకంత ఖరీదా?" అన్నాడు.

నేను కుర్చీ తలకి తల ఆనించలేదు గాని, జారగిలబడి కూర్చున్నవాణ్ణల్లా, లేచి, నిటారుగా సర్దుక్కూర్చుని, టేబుల్ అంచులమీద మోచేతులానించి, అరచేతులమీద గడ్డం నిలుపుకున్నాను.

"దేఖియే, సాహబ్! ఇదిగో, వినండి. నా కాలుకి ఖరీదు అంటున్నారే మీరు, మీరు చాలా పొరబడు

తున్నారు. మీరనుకున్నదానికంటే ఎక్కువే ఔతుందా కాలు ఖరీదు. ఎట్లాగో చెప్పనా? వింటారూ!"

"నాకింకా చాలా పనులున్నై"అన్నాడు ఆఫీసర్.

"ఫర్వాలేదులే, వినండి" అన్నా నేను. "నా కాలుండే ఇది పోయిందన్నమాటే గాని, పోతూ పోతూ ఇంకా చాలా ఖర్చు తెచ్చిపెట్టింది ప్రభుత్వానికి. రిపేర్లకోసం డాక్ యార్డ్ (ఓడలు బాగుచేసే చోటు)లో కొచ్చింది మా ఓడ అంతా సరిగ్గా వుందో, లేదో చూచేందుకు ట్రయల్స్ వేస్తున్నాం చివరి రోజున. ఉన్నట్లుండి, బోయిలర్ రూమ్‌లోనుంచి, ఎంజిన్ రూమ్‌లోకి స్టీమ్ (నీటి ఆవిరి) పట్టుకొచ్చే పైప్‌లో బెజ్జం బయట బడింది. ఎంజిన్ రూమంతా ఆవిరితో నిండి పోతోంది. అక్కడున్నవాళ్ళంతా గొప్ప గొప్ప ఉద్యోగులు; ఆఫీసర్లు; ట్రయల్స్ వేస్తున్నాంకదా చూచి "సరే, ఓకే" అనేందుకొచ్చారు. డాక్ యార్డ్ సూపరింటెండెంటూ, కమాండింగ్ ఎంజినీరూ; చీఫ్ ఎంజినీరూ మాకప్టెనూ — అందరూ వరుసగా వున్నారు పైనుంచి కిందదాకా. బయటికెళ్ళిపోవాలంటే తెరచుకొన్న దొక్కటే దారి; నిలువుగా వున్న ఇనప చువ్వల నిచ్చెనెక్కి వెళ్లాలి. అందరూ నిచ్చెనేపురు పరుగెత్తారు. అప్పటికే అంతా మసక మసగ్గా వుంది. ఆవిరి మూలాన అందరికంటే వెనక, నిచ్చెనదగ్గరున్నా నేను. గబ గబా మెట్లెక్కా; పారిపోదామని కాదు. వెళ్ళి ఎమర్జెన్సీ వాల్వ్ మూద్దామని. అది మూస్తే ఆవిరి ఆగిపోతుంది; అందరూ బ్రతుకుతారు. లేకపోతే కనీసం నలుగురైదుగు

రన్నా నూనెలో వేయించినట్టయిపోతారు. తొందర్లో కాలు ఇనపచువ్వల మధ్య పడిపోయింది. మెట్టుకు రెండు చువ్వలుంటాయి, రెండు చువ్వల మధ్యా ఖాళీ వుంటుంది. ఆ ఖాళీలో పడింది నా కాలు. పైకి లాగానేమో ఫెళ్ళుమంది బొమిక, పైచర్మం వూడిందిగూడాను. ఆ తొందర్లో అదేవీఁ పట్టలేదు నాకు; రాక్షస బలం వొచ్చిపడింది, వెళ్ళి ఆ వాల్వ్ మూసేసిం తర్వాత గాని తెలియలేదు. అక్కడిదాకా ఒక్క కాలుమీదే కుంటుకుంటూ రెండంగల్లో వెళ్ళానని—విన్నారా?"

"ఇంకా చాలా పనులున్నై నాకు" అన్నాడు ఆఫీసర్.

"యేం ఫర్వాలేదు. వినడవేఁగా మీ పని. ఎవరేది చెప్పినా వినడం; వినక పూర్వం మీరేం చెయ్యాలనుకున్నారో సరీగ్గా అదే విన్నతర్వాత గూడా చెయ్యడం; అదేగా మీ పని. వినండి ఫర్వాలేదు. చూశారూ, ఆ పెద్ద పెద్ద ఆఫీసర్లందరూ బ్రతికారు. ఆ బెజ్జం పడ్డ పైప్‌కి దగ్గర్లోనే వున్న ఒక స్టోకర్ బోయ్ చచ్చిపోయాడనుకోండి. మరీ దగ్గరగా వున్నాడేమో, వచ్చిన ఆవిరి రెండువందల యాభై పౌండ్ల ప్రెషర్‌తో కళ్ళల్లోకొట్టింది. అంతే పడిపోయాడు. తర్వాత కాలిపోవడవేఁగా జరిగేది. ప్రభుత్వం అతని కేవీఁ ఇవ్వ పెట్టను గూడ లేదు. చాలా చవగ్గాగూడా వచ్చాడు. నెలకి ముప్పై ఐదు రూపాయలు, చేరి ఆరునెల్లయ్యిందేవోఁ ఖర్చేఁ వుంటుంది? సరేనా ఇప్పుడా పెద్ద పెద్దాఫీసర్లంతా నిండు

ప్రాణాల్తో నిండు జీతాలు తీసుకుంటున్నారు. ఆ ఆఫీసర్ల సగటు వయసిప్పుడు నలభై ఐదు వుంటుందనుకోండి. నేవీ తిండి తిని, బ్రిటన్‌లో తయారైన హ్విస్కీలు తాగుతూ, సముద్రం గాలి పీలుస్తూ కూర్చోడమేగా వాళ్ళ పని. అందుకని బాగా ఆరోగ్యంగా వుంటారు. ఎట్లా లేదన్నా ఇంకో ఇరవై యేళ్ళు బ్రదుకుతారు. యేడాదికి పన్నెండు నెలలు, నెలకి ముప్ఫై రోజులు. పన్నెండు ముప్ఫైలు మూడువందలరవై, ఇరవై మూడువందల అరవైలు—సరే. నెలకి సగటున పదిహేను వందల రూపాయల చొప్పున ఆ నలుగురికీ ఇరవై యేళ్ళకి. అబ్బ—యెంత డబ్బో చూశారా. వృథా అన్నమాట. నా కాలు పోయింది పోక, చూశారా యెంత ఖర్చు తెచ్చి పెట్టిందో ప్రభుత్వానికి!"

"అనుమానమేమీ లేదు. నీకు పిచ్చెక్కింది."

"సహీం సాహబ్. నాకు పిచ్చేమిటి. చూడండి ఈ భూప్రపంచంలో ఇంత ఖరీదుచేసే కాలింకెవరికైనా వుంటుందీ? నేనింకే మూలనో వుంటే, ఆఫీసర్లెవరూ ఎట్లాగూ పరుగెత్తరు కాబట్టి, పరిగెత్తలేరు కాబట్టి, హాయిగా వుండేది. ఎక్కడి వాళ్ళక్కడ సంబారు బుడ్లు ఐపొయ్యేవారు — వాళ్ళతో పాటు నేనూనూ. అప్పుడీ పింఛను సమస్యే వుండేది కాదు. పంచవర్ష ప్రణాళికలు దివ్యంగా సాగిపొయ్యేవి. ఐతే ఒక చిక్కొచ్చిపడింది. మొట్టమొదట్నుంచీ కూడా దిట్టమైన

మనిషిన్నేను. మంచి ఆరోగ్యం, గట్టి గుండె వున్నై నాకు. ఎంత ప్రమాదం ఎదురుపడినా ఆలోచించగల తెలివితేట లున్నై నాకు —"

"సరే గాని, ఆ గోడకానుకుని కూర్చునే ఉద్యోగం చేస్తావా లేదా ఇంతకీ?"

"చెయ్యను" అని లేచి వచ్చేశా వొంటికాలిమీద.

— /o/ —